



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ఎస్‌సి, ఎస్‌టి ప్రొఫెసర్లకు అన్యాయం

- దక్కని కీలకమైన పదవులు
- వర్సిటీ ఉన్నతాధికారుల తీరుపై ఆగ్రహం



ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో రోజుకు ఒక వివాదం చోటు చేసుకుంటుంది. ఇప్పుడు ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన ప్రొఫెసర్లకు కీలకమైన పదవులు తప్పకుండా నామ మాత్రం వాటిని కేటాయించారు. వర్సిటీ ఉన్నతాధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల రెండు రోజుల క్రితం పరిపాలన బాధ్యతల పర్యవేక్షణకు సంబంధించిన పదవుల నియామకాలకు సంబంధించి వర్సిటీలో ఉన్నతాధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తమౌతుంది. యూనివర్సిటీ పరిధిలో పరిపాలన వ్యవహారంలో కీలకంగా ఉన్న పోస్టులను కొంతమందికి సీనియారిటీ లేకపోయినా అప్పగించారు. సీనియారిటీ ఉన్నటువంటి ప్రొఫెసర్లకు మాత్రం నామమాత్ర పోస్టులను మాత్రమే కేటాయించారు. ఇందులో ఇద్దరు ఎస్‌సి వర్గానికి చెందిన వారు మరొకరు ఎస్‌టి వర్గానికి చెందిన ప్రొఫెసర్లు ఉన్నారు. ముగ్గురు సీనియారిటీ ప్రొఫెసర్లు అయినప్పటికీ వారికి పరిపాలనలో పూర్తిస్థాయి గుర్తింపు లేనటువంటి పోస్టులకు కేటాయించారు. విద్యార్థుల వ్యవహారాల డీన్‌గా ఎన్‌టికె నాయక్, ఎగ్జామినేషన్స్ డీన్‌గా ఎన్. నరసింహులు, అకాడమిక్ అఫైర్స్ డీన్ గా సివి.కృష్ణారెడ్డి, రాయలసీమ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ చీఫ్ వార్డెన్ గా విశ్వనాథ్‌రెడ్డిని నియమించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ గా సివి సుందరానందపుచ్చ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్‌గా భరత్ కుమార్ నియమితులయ్యారు. సీనియార్టీ ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లకు ఎలాంటి గుర్తింపు లేని పదవులను కట్టబెట్టారు. ఇందులో మహిళా ప్రొఫెసర్‌కు ఎలాంటి బాధ్యతలను అప్పగించకపోవడం పట్ల చర్చ కొనసాగుతుంది. ఇద్దరు ఎస్‌టి వర్గానికి చెందిన ప్రొఫెసర్లకు అసలు ప్రాధాన్యత లేనటువంటి పదవులను కట్టబెట్టడం పట్ల కూడా చర్చ కొనసాగుతుంది. ఇందులో ముగ్గురు ప్రొఫెసర్లు సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి ఉత్తర్వుల ప్రకారం పనిచేస్తున్నారు. వీరిపై అనేక ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ముగ్గురు ప్రొఫెసర్లకు అదనంగా మరికొన్ని కీలక పదవులను కూడా అప్పగించడం పట్ల కూడా చర్చనీయాంశమైంది. ఇప్పటికే వర్సిటీ ఉన్నతాధికారుల వ్యవహార శైలిపై టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వర్సిటీలో చేపట్టిన నియామకాలను వెంటనే రద్దు చేయాలని వారి డిమాండ్ చేస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి విచారించాలి

- బిఎల్‌ఒలను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్లి విచారణ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి శిక్షణా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో కర్నూలు (అర్బన్), పాణ్యం, ఆదోని నియోజకవర్గాల బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్‌ఓ)లతో ఎస్ఐఆర్ – 2026 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కర్నూలు, పాణ్యం ,ఆదోని నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల మ్యాపింగ్ వెనుకబడి ఉందన్నారు. రాబోయే పది రోజుల్లో అర్బన్ 80 శాతం, రూరల్ 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగాలని, ఈ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , డిఆర్‌ఒ వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరిండెంట్ మురళి, సంబంధిత నియోజకవర్గాల తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారులు పాల్గొన్నారు.

ఎలక్టర్ల మ్యాపింగులో పురోగతి అవసరం

ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, డిఆర్‌ఒ సి.వెంకటనారాయణమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి ఇఆర్‌ఒలకు, ఎఇఆర్‌ఓలకు, బి ఎల్‌ఒలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బిఎల్‌ఒ ఐడి కార్డులను పంపిణీ చేశారన్నారు. పెండింగులో ఉన్న ఫార్మ్‌లను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎపిక్ కార్డులను కూడా పంపిణీ చేశామని కలెక్టర్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కోసం 1న ధర్నాలు


- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లాలో వలసలు అరికట్టి ఉపాధి హామీ పనులు కల్పించాలని డిశంబర్ 1న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ కోరారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. కెవి.నారాయణ మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ పనులు లేక గ్రామీణ పేదలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. వలసలను అరికట్టి పనులు ఆపాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని అన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు , వలసల గురించి ఆలోచనే లేదన్నారు. దాదాపు గ్రామాలు ఖాళీ అయ్యాయన్నారు. వలసలు ఆపేందుకు కనీసం ప్రయత్నం కూడా లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టం అని తొలగించి స్కీమ్ అని పెడుతున్నారు. పథకాని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఉదయం పూట, సాయంత్రం పూటా మస్టర్ వేసే విధానాన్ని రద్దుచేయాలని అందుకే డిసెంబర్ 1 న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని జిల్లా కమిటీ గా నిర్ణయించామని అన్నారు. ఇది ప్రారంభం మాత్రమే ఉపాధిహామీ నిర్వీర్యం చేస్తే పేదల తిరుగుబాటు తప్పదని అవసరమైతే రాష్ట్ర వ్యాపిత ఉద్యమం చేపడతామని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న,సహాయ కార్యదర్శి బి. నాగన్న, బాలకృష్ణ, శ్రీరాములు, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

డిఇఒకు బాలోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ఇండస్ పాఠశాలలో డిసెంబర్ 9,10 తేదీల్లో జరిగే కర్నూలు బాలోత్సవం కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం డిఇఒ శామ్యూల్ పాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధనుంజయ, జె.రఘుబాబులు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే బాలోత్సవ పండుగను ఎంతో ఉత్సాహ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు వేలాది మంది హాజరవుతారని పేర్కొన్నారు.

లేఖనా కంపెనీపై చర్యలు తీసుకోవాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నకిలీ విత్తనాలతో రైతులను నట్టేట ముంచిన లేఖన కంపెనీని సీజ్ చేయాలని, వరి విత్తనాలు అమ్మిన కిసాన్ సీడ్స్ షాపు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. గురువారం బాధిత రైతులతో కలిసి వ్యవసాయ శాఖ సూపరిం టెండెంట్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్ట డంలో అధికారులు చొరవ చూపాలన్నారు. లేఖనా కంపెనీ సరఫరా చేయగా, కర్నూలులోని కిసాన్ సీడ్స్‌షాపు అమ్మకాలు చేపట్టిందన్నారు. నకిలీ వరి విత్తనాన్ని కొనుగోలు చేసి సాగు చేసిన 18 మంది నిర్జూరుగ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఐదువారాల క్రితం వరి విత్తనాలు నకిలీ విత్తనాలు సరఫరా చేశారని, కలెక్టర్‌కు రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులతో విజ్ఞాపన పత్రం ఇచ్చామన్నారు. కలెక్టర్ వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారన్నారు. అగ్రికల్చర్ కర్నూలు ఎడి, కర్నూలు శాస్త్రవేత్తలు స్పందించి నిర్జూరు రైతుల వరి పొలాలను పరిశీలించారన్నారు. వారు అక్కడే ఈ విత్తనాలు నకిలీ విత్తనాలని కేడీలు ఎక్కువగా ఉన్నాయని ఒక ఎకరాకు 16 బస్తాలు నష్టపోయారని తెలిపారన్నారు. కంపెనీ యాజమాన్యం, కిసాన్ సీడ్స్ షాపు యాజమాన్యం వారు సంయుక్తంగా రైతులు ఎక్కడికి వెళ్ళవద్దని మీకు తగిన నష్టపరిహారము ఇస్తామని నమ్మబలికారన్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి నష్టపరిహారం రైతులకు ఇవ్వలేదన్నారు. ఆలస్యం అయితే రైతులు మిన్నకుండా ఉంటారని ఒక దురుద్దేశంతో కాలయాపన చేసినట్లు రైతులు భావిస్తున్నారన్నారు. తక్షణమే కలెక్టర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జోక్యం చేసుకొని నిర్జూరు వరి రైతులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కిసాన్ సీడ్స్ షాపు ముందు నిరాహార దీక్షలు, వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నిర్జూరు మాజీ సర్పంచి కృష్ణ, స్థానిక రైతులు వెంకటేశ్వర్లు, ఎం.గిడ్డయ్య, బి.గిడ్డయ్య, శ్రీనివాసులు అయ్యస్వామి, సోమశేఖర్, శేషాద్రి పాల్గొన్నారు.



పద్మజకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

29న డప్పు కళాకారుల ఆత్మగౌరవ సభ

- ఎపిడికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం కర్నూలు జిల్లా 5వ మహాసభలను ఈనెల 29న ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్న సందర్భంగా దళిత డప్పుల కళాకారుల ఆత్మగౌరవ ప్రదర్శన, బహిరంగ సభలను నిర్వహిస్తున్నామన్నామని, ఈ సభకు అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎపిడికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి. ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి. కరుణాకర్ కోరారు. గురువారం కర్నూలు నగరం లోని కార్మిక కర్షక భవన్ వద్ద ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎపిడికెయస్ జిల్లా నాయకులు గుట్టపాడు రామకష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎండి. ఆనంద్ బాబు, బి.కరుణాకర్ మాట్లాడారు. పాలక వర్గాలకు స్టేజీ కళాకారులపై ఉన్న కనీస ఆధరణ కూడా, తరతరాలుగా అంటరానితనాన్ని భరిస్తూ ఆకలి దప్పులతో ఉన్న సాంప్రదాయ కళాకారులపట్ల లేకుండా పోయిందన్నారు. డప్పు కళాకారులు సమస్యలతో పాటు యావత్ దళితులు ఎదుర్కనే సమస్యలపై కూడా పోరాటాలు నిర్వహించేలా 29న ఎమ్మిగనూరులో జరిగే జిల్లా మహాసభ చర్చిస్తుందన్నారు. డిసెంబర్ 15 లోపు అన్ని జిల్లాల మహాసభలు నిర్వహించి జనవరి 3,4న విశాఖ పట్టణంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా గా జరిగే ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బైరాపురం కృష్ణ, బతకన్న, ముని తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు



విజేతలయిన విద్యార్థులతో పాఠశాల చైర్మన్ ఎవి రమణారెడ్డి, సిఇఒ చరిత

బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ జట్టు అద్భుత ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

వరంగల్‌లో జరిగిన బిర్లా సౌత్ జోనల్ స్పోర్ట్స్ మీట్–2025లో బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ కర్నూలు జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరిపిస్తూ అండర్–17 క్రికెట్ , వాలీబాల్ విభాగాల్లో మూడవ స్థానాన్ని సాధించారు. ఈ విజయంపై పాఠశాల చైర్మన్ ఎవి రమణారెడ్డి, సిఇఒ చరిత విద్యార్థులను అభినందించారు. విజయసంబరాల్లో పాల్గొన్న మేనేజింగ్ డైరెక్టర్ హవీష్ రెడ్డి మాట్లాడుతూ బోమిస్ కర్నూలులో క్రీడా శిక్షణ ఐదు 'ఎస్'లు స్టామినా, వేగం, బలం, నైపుణ్యం మరియు స్ఫూర్తి ప్రతి విద్యార్థిలో వ్యక్తిగతంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి పిల్లవాడు తనకు నచ్చిన క్రీడలో ప్రావీణ్యం సాధించేలా శిక్షణ అందించడమే మా లక్ష్యం' అన్నారు. క్రీడల కృషికి క్రమశిక్షణకు , అంకితభావానికి ప్రతిరూపమని అన్నారు. సహజసిద్ధ ప్రతిభ కలిగిన అథ్లెట్లు కూడా తమ క్రీడలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలంటే నిరంతర శ్రమ, పట్టుదల, సంకల్పం అవసరమని తెలిపారు. క్రీడలు అంటే మానవ సంకల్పం అసమానతలను అధిగమించే అద్భుత క్షణాల సమాహార మన్నారు. జట్ల విజయానికి కృషిచేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ ప్రిన్సిపల్ ఎ.కాదంబరి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి పోరాటం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి- గూడూరు



నూతన కమిటీతో సాయిఉదయ్ , తదితరులు

ప్రభుత్వ విద్యారంగం పలోపేటానికి విద్యార్థులు పోరాటాల్లోకి రావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గూడూరు మండల కమిటీ ఎస్ఎఫ్ఐ సమాశంలో బుధవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షుడు సాయిఉదయ్, సిఐటియు మండలం నాయకులు గుంటప్ప, మండల కార్యదర్శి కాజావలి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యను సామాజిక హక్కును కాకుండా మార్కెట్ ఉత్పత్తిగా మారుస్తున్నారన్నారు. ప్రస్తుత విద్యారంగం అత్యంత సంక్షోభంలో ఉందని, ప్రభుత్వం ప్రజా విద్యను బలపేతం చేయాల్సిన సమయంలో కేవలం దానిని వ్యాపారంగా మార్చే ప్రైవేటీకరణ విధానాలను వేగంగా విస్తరిస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు గురవుతుండగా పట్టణాల్లో ప్రయివేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తుందన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తూ మరిన్ని పోరాటాలకు భవిష్యత్తులో నిర్వహిస్తుందని అన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. గూడూరు మండల కమిటీ అధ్యక్షులుగా మధు, కార్యదర్శిగా కాజావలి, కమిటీ సభ్యులుగా పదిమందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలోవిద్యార్థులు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

29వ వార్డులో రహదారులు అస్తవ్యస్తం

-కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు
-ఖాళీ ప్లాట్లలోకి చేరుతున్న మురుగునీరు
-విపరీతంగా వృద్ధి చెందుతున్న దోమలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 29వ వార్డులో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి.కాలనీల్లోకి వెళ్లిరావడం చాలా ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరంతా ఖాళీ ప్లాటు లోకి చేరి దుర్వాసన వస్తుంది. మురిగు నీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలను కాటు చేస్తున్నాయి. దోమ కాటుకు వైరల్ టైఫాయిడ్ మలేరియా డెంగీ వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాలతో భయాందోళన చెందుతున్నారు. విషజ్వరాలతో బాధితులు ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ఆర్‌ఎంపి క్లినిక్‌వద్ద క్యూ కడుతున్నారు. మురుగు కాలువలు లేకపోవడంతో ఖాళీ ప్లాట్లు రహదారులపై మురుగునీరు నిల్వ ఉండి గుంతలుగా ఏర్పడు తున్నాయి. వాసునగర్‌లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుద్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మహమ్మద్‌నగర్, వాసు నగర్, కృష్ణప్రియనగర్, రామేశ్వర్‌నగర్, వివిఎస్‌ఫంక్షన్‌హాల్ లైన్, మమతా నగర్ వాసులకు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో బోర్ల ద్వారా వచ్చే ఉప్పు నీరు సుద్ద నీరు వినియోగిస్తూ కాలనీ వాసులు పలు రకాల చర్మ వ్యాధులకు గురవుతున్నారు.



ఎగుడు, దిగుడు మట్టిరోడ్డు

అధికారులు స్పందించాలి

మౌలాలి, సవారి తోట 29వ వార్డు కల్లూరు అర్బన్



సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి. 29వవార్డులోని కాలనీలలో మురుగు కాలువలు, రహదారులు అభివృద్ధి చేయాలి. కాలువలు లేక మురుగునీరు ఖాళీ ప్లాట్ లో నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటుకు కాలనీలలో అనారోగ్య పాలవుతున్నారు. భూమి పూజ చేసిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి. వార్డులో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలి. ఇక్కడి సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

యేసు రాజు, సిపిఎం వార్డు కార్యదర్శి



29వవార్డులోని విస్త రిస్తున్న కాలనీలలో మౌలిక సదు పాయాలు కల్పించాలి. తాగునీటి పైపులైన్, డ్రెయినేజీ, రోడ్ల సమస్య లున్నాయి. మురుగు కాలువల నిర్మించాలి. ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పర్యటించి ప్రజా సమస్యలను సేకరించి కమిషనర్‌కు విన్నవించాం. అధికారులు ఇప్పటికైనా స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

వ్యవసాయ ఇంజన్ల చోరీకి యత్నం

-ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన రైతులు

ప్రజాశక్తి- వెల్దుర్తి : గోకులపాడు రహదారిలోని హంద్రీకాలువ వద్ద వ్యవసాయ సాగు కోసం ఏర్పాటు చేసుకున్న డీజిల్ ఇంజన్లను అపహరించేందుకు వచ్చిన వారిని నార్లాపురం, మల్లేపల్లి, గోకులపాడుకు చెందిన రైతులు పట్టుకున్నారు. గతంలో సైతం దాదాపు 12 మోటర్లు అపహరణకు గురి కావడంతో రైతులు ఈ ప్రాంతంలో నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఆటోలో ముగ్గురు వ్యక్తులు గోకుల్‌పాడు రహదారిలోని కాల్వ వద్ద ఉన్న మోటార్లను అపహరించేందుకు ప్రయత్నించారు. నార్లాపురం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు చెందిన డీజిల్ ఇంజన్‌ను తీగలు కత్తరిస్తుండగా రైతులు గుర్తించారు. రైతులు రావడానికి పసిగట్టడంతో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని వారు తెచ్చుకున్న ఆటోను వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

సమిష్టి కృషితో బాల్య వివాహాల నివారణ

ప్రజాశక్తి- కోడుమూరు

సమిష్టికృషితో బాల్యవివాహాలను నివారించవచ్చని అతిథులు సూచించారు. కోడుమూరు పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కౌమార బాల బాలికల ఆరోగ్య , క్షేమ దినం గురువారం రోజున కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీమంత్ మాదన్న , పాఠశాల ఇంచార్జ్ స్పెషల్ ఆఫీసర్ సుప్రజ ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాల లోపు , బాలురకు 21 సంవత్సరాలలోపు వివాహం చేయకూడదన్నారు.ఆ విధంగా చేసినట్లయితే బాల్య వివాహాల వల్ల ఎన్నో దుష్ప్రభావాలు సంభవించే అవకాశం ఉందని, బాలికలకు అనారోగ్యం రక్తహీనత అకాల గర్భం, శిశు ప్రసూతి మరణాలు అక్షరాస్యత పేదరికం వంటి జరిగే అవకాశం ఉందన్నారు. బాల్యవివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగ పిల్లలకు పెళ్లి చేయడం చట్టరీత్య నేరం. అలా చేస్తే రెండేళ్ల జేలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంద న్నారు. బాల్యవాహాలు జరుగుతున్నాయన్న సమాచారం ఉన్నట్ల యితే వెంటనే చైల్డ్ లైన్ 1098, పోలీస్ 100, దిశా 181అండ్ 112 సమాచారం ఇవ్వాలన్నారు. హెల్త్ సూపర్వైజర్ కె. కమాల్ సాహెబ్, ఆర్‌బిఎస్‌కె కౌన్సిలర్ శ్వేత కోడుమూరు నాలుగో సచివాలయం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నవీన్ ఆరోగ్య కార్యకర్త సుజాత పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థినిలు పాల్గొన్నారు.





డాక్టర్ సుధాకుమారి దంపతులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

డాక్టర్ సుధాకుమారి సేవలు ఉత్తమం

కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కమ్యూనిటీ మెడిసిన్ విబాగాధిపతి డాక్టర్ సుధా కుమారి సేవలు అత్యుత్తమమని తన విభాగాన్ని సజావుగాగా ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా తన పదవీకాలంలో చక్కగా నడిపించించారని అడ్మినిస్ట్రేటర్ కు ఉండాల్సిన ఒక మంచి లక్షణమని కర్నూలు మెడికల్‌కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ అన్నారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి ప్రొఫెసర్ సుధాకుమారి ఈనెల 30న పదవీ విరమణ సందర్భంగా కాలేజీలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ఎపిజిడిఎలు వేరువేరుగా వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ సుధా కుమారిని ఘనంగా సన్మానించారు. ప్రిన్సపల్ మాట్లాడుతూ డాక్టర్ సుధాకమారి మంచి అడ్మినిస్ట్రేటర్ అని ఎవరినీ నొప్పించకుండా అందరికీ అనుకూలంగా ఉన్నారన్నారు. విద్యార్థులతో కూడా ఉత్తమ ఫలితాలు సాధించారనికొనియాడారు. హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ సుధాకుమారి మంచి సేవలందించారని వారి విభాగం ఆధ్వర్యంలో వెల్నెస్ క్లినిక్ చక్కగా పనిచేస్తుందన్నారు. ఎపిజిడిఎ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ ఎపిజిడిఎకు గుర్తింపు లభించినందుకు ప్రభుత్వానికి, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. సన్మాన గ్రహీత కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధి పతి డాక్టర్ సుధా కుమారి మాట్లాడుతూ 38 సంవత్సరాల ప్రభుత్వ సర్వీసు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పనిచేసిన మూడు సంవత్సరాల కాలం ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. తన విభాగం తరపున అనేక సర్వేలు, ప్రాజెక్టులు చేపట్టామన్నారు. తనకు సహకరించిన అందరినీ అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్స్ సిందియా శుభప్రద, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ విజయ్ ఆనంద్ బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, డాక్టర్ రేణుక, ఎపిజిడిఎ నాయకులు డాక్టర్ మాధవి శ్యామల, డాక్టర్ ధమ్మమ్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీరాములు, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, డిసిఎస్‌లు డాక్టర్ రాధ, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ స్వర్ణకుమారి అసిస్టెంట్ ఆఫీసర్లు డాక్టర్ రవి నాయక్ డాక్టర్ పుష్పలత, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్‌లో ఎనిమిది మంది డిబార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 5వ సెమిస్టర్ , బిఇడి 3వ సెమిస్టర్‌లో ఎనిమిది మంది విద్యార్థులు డిబారయ్యారు. ఇందులో బిఇడి సెమిస్టర్ లో నలుగురు, డిగ్రీ సెమిస్టర్ లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడించారు.


రైతులకు కరపత్రాలు పంచుతున్న రాఘవేంద్రరెడ్డి

రైతు అభివృద్ధి కోరే ప్రభుత్వం కూటమి

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

దేశంలోనే రైతు అభివృద్ధి కోరే ఏకైక ప్రభుత్వం కూటమి అని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్రారెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కామన్ దొడ్డి గ్రామంలో 'రైతన్న మీకోసం' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఇంటింటికీ తిరుగుతూ రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో నెలలు గడిచినా ధాన్యపు బిల్లులు జమ కాలేదని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ అవుతోందని చెప్పారు. రసాయనాల బారి నుంచి రైతు కుటుంబాలను రక్షించేందుకు సేంద్రీయ వ్యవసాయం, భూసార రక్షణ పంచసూత్రాల కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి మండల నాయకులు ముత్తురెడ్డి, జ్ఞానేష్, మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేష్, హోళగుంద కోసిగియ్య, జక్కనగేని వెంకటేశ్వర్లు, దొడ్డయ్య, వీరేష్, నరసింహులు, భీమిరెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పార్థసారథి


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. గురువారం ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని అమరావతి నగర్ కాలనీలో రూ.10 లక్షలతో కౌన్సిలర్ లలితమ్మ ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చానని, అందులో భాగంగానే అమరావతి నగర్ కాలనీలో గడిచిన వారం రోజుల్లో రెండోసారి భూమి పూజ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గమంతా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. తాగునీటి సమస్యలను కూడా త్వరలోనే అధిగమించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నాయకులు ఉపేంద్ర, నూర్జహాన్, పరశురామ్, యశోదమ్మ పాల్గొన్నారు.

వైద్య విద్య పరిరక్షణకు కలిసి రావాలి

- వైసిపి ఇన్‌ఛార్జీ రాజీవ్ రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

వైద్య విద్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాలల పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అలువాల, గోనెగండ్ల గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేస్తూ పిపిపి విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరమవుతుందని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ కెవి.కృష్ణారెడ్డి, అలువాల ప్రమోద్ రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి టి.బందే నవాజ్, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఎస్‌బి.మన్సూర్, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, చికెన్ రాజా, మహేశ్వర రెడ్డి, ఉస్మాన్, రఫీ, నదీముల్లా, గోవిందు, రంగన్న నాయుడు, పూజారి కౌలుట్లయ్య, రంగస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్ రెడ్డి

ప్రైమరీ పాఠశాల అస్తవ్యస్తం

- పైకప్పు పెచ్చులూడి ప్రాణభయంతో విద్యార్థులు - నిర్లక్ష్యం వహిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం సోమలగూడూరు గ్రామంలో ఉన్న ప్రైమరీ పాఠశాల అస్తవ్యస్తంగా మారింది. ఊరి చివరన కలుషితమైన వాతావరణం, పక్కన వాగు, ముళ్ల చెట్లతో దుర్భరంగా ఉంది. పాఠశాల పైకప్పు పెచ్చులూడి ప్రమాద స్థాయిలో ఉంది. విద్యార్థులు ప్రాణభయంతో బిక్కు బిక్కుమంటూ విద్యనభ్యసిస్తున్నారు. పిల్లలకు పాఠశాలలో రక్షణ లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో మిద్దె పై నుంచి నీరు పడి విద్యార్థులు కూర్చోవడానికి కూడా ఉండదు. పాఠశాలలో ఉన్న ఫర్నీచర్ కూడా తడుస్తోంది. పాఠశాల మొత్తానికి ఐదు తరగతి గదులు ఉన్నాయి. అందులో ఒక గదిలో ఫర్నీచర్, కట్టెలు, ఇనుప కడ్డీలను వేశారు. ఉన్న నాలుగు గదుల్లో రెండు గదులు పైకప్పు ఎప్పుడు ఊడిపడుతుందో తెలియని స్థితిలో ఉన్నాయి. ఒకే గదిలో స్టాఫ్ రూము, తరగతులను నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పైకప్పు పెచ్చులూడిన ప్రదేశంలో ఆడుకుంటున్న విద్యార్థులు

ప్రహరీ లేక ప్రాణభయంలో విద్యార్థులు

పాఠశాల చుట్టూ ప్రమాద వాతావరణం ఉంది. ప్రహరీ లేకపోవడం వల్ల విషసర్పాలు ప్రవేశించే అవకాశం ఉన్నాయి. పాఠశాల ఆవరణలో ముళ్ల చెట్లు మొలిచి ఉన్నాయి. పాఠశాల ఆవరణకు ఆనుకొని వాగు ఉంది. విద్యార్థులు అటువైపు వెళ్లారంటే ప్రాణాపాయం వాటిల్లే ప్రమాదం ఉంది.

నాయకులు, అధికారుల నిర్లక్ష్యం

విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే విధంగా పాఠశాల ఉంది. ఎన్నికల సమయంలో మాత్రం ఓట్ల కోసం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తామని హామీలు ఇస్తారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. చిన్నపిల్లల ప్రాణాలకు భద్రత లేని విధంగా పాఠశాల ఉన్నా నాయకులు స్పందించకపోవడం బాధాకరమైన విషయం. అధికారుల పర్యవేక్షణ కూడా లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు.


విద్యార్థులు ఆడుకుంటున్న ప్రదేశంలో ప్రమాదకరంగా ఉన్న కడ్డీలు

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

- ప్రకాష్ రాజ్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి



నాయకులు, అధికారులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి. 150 మంది పేద విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల మాత్రం సమస్యల వలయంగా ఉంది. నాయకులు, అధికారులు స్పందించి పాఠశాలను అభివృద్ధి చేసి.. చిన్నారులకు ప్రమాదం జరగకుండా చూడాలి.

త్వరలో అదనపు గదుల నిర్మాణం

- ప్రధానోపాధ్యాయులు శ్రీధర్



మూడు అదనపు గదుల నిర్మాణం ప్రారంభమవుతుంది. విద్యార్థుల భద్రతపై జాగ్రత్త వహిస్తున్నాం. సురక్షితంగా ఉన్న ప్రదేశంలో మాత్రమే విద్యార్థులు ఉండేలా చూస్తున్నాం. విద్యార్థులు వాగు ఉన్న ప్రదేశానికి వెళ్లకుండా జాగ్రత్త వహిస్తున్నాం.



అభినందనలు తెలుపుతున్న నాయకులు

సొసైటీ ఛైర్మన్ల ప్రమాణ స్వీకారం

- బెల్డోన సొసైటీ ఛైర్మన్‌గా రామాంజనేయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని బెల్డోన సొసైటీ ఛైర్మన్‌గా కొండ రామాంజనేయులు గురువారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సొసైటీ సిఇఒ హరికృష్ణ.. ఛైర్మన్ కొండ రామాంజనేయులు, డైరెక్టర్లు, దస్తగిరి, కృష్ణవేణితో ప్రమాణం చేయించి రికార్డు పూర్వకంగా సంతకాలు చేయించారు. కొండ రామాంజనేయులు సొసైటీ ఛైర్మన్‌గా, డైరెక్టర్లుగా బంటన హాలు దస్తగిరి, నంచర్ల కృష్ణవేణి కొనసాగుతారు. సొసైటీ ఛైర్మన్‌గా కొండ రామాంజనేయులును, డైరెక్టర్లను సొసైటీ సిఇఒ హరికృష్ణ పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. తనకు సొసైటీ ఛైర్మన్ రావడానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, శివ ప్రసాద్‌లు కృషి చేశారని, వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని చెప్పారు. మండలంలో రైతులకు సహాయ, సహకారాలు అందిస్తామని, సొసైటీ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సర్పంచులు పురుషోత్తం, గోవిందరాజులు, టిడిపి నాయకులు వైకుంఠం వెంకటేష్, పోతురాజు రాముడు, జనార్ధన స్వామి, తిమ్మప్ప, దేవరగట్ట ఆలయ కమిటీ డైరెక్టర్ జయన్న, గద్దల ఎర్రన్న, సత్తన్న, వీరాంజి, రవితేజ, బర్మే లక్ష్మీనారాయణ, బిజెపి నాయకులు గోపాల్, నారాయణస్వామి, కొండ చిన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామాంజనేయులు

చింతకుంట సొసైటీ ఛైర్మన్‌గా ప్రకాష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హాలహర్వి


మండలంలోని చింతకుంట సొసైటీ ఛైర్మన్‌గా మోకా ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం కార్యాలయంలో సొసైటీ సిఇఒ వీరస్వామి ఛైర్మన్ మోకా ప్రకాష్, డైరెక్టర్లు నాగోతి ప్రసాద్, ఉచ్చీరప్పతో ప్రమాణం చేయించి రికార్డు పూర్వకంగా సంతకాలు చేయించారు. ప్రకాష్ సొసైటీ ఛైర్మన్‌గా, హాలహర్వికి చెందిన నాగోతి ప్రసాద్, బిలేహాల్‌కు చెందిన ఉచ్చీరప్ప డైరెక్టర్లుగా పని చేస్తారు. సొసైటీ ఛైర్మన్, డైరెక్టర్లను సొసైటీ సిఇఒ వీరస్వామి పూలమాల, శాలువా వేసి సన్మానించారు. సొసైటీ ఛైర్మన్ ప్రకాష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట వేశారని తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, శివ ప్రసాద్‌కు, టిడిపికి రుణపడి ఉంటానని చెప్పారు. టిడిపి మండల కన్వీనర్ శ్రీధర్, మాజీ కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి పాల్గొన్నారు.


హాలహర్విలో ప్రకాష్‌ను సన్మానిస్తున్న నాయకులు, సిబ్బంది

ఛైర్మన్‌గా ఈరన్న బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -ఆలూరు

ఆలూరు సొసైటీ ఛైర్మన్‌గా మొలగవల్లి గ్రామానికి చెందిన కురువ బేవిని ఈరన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ ఛైర్మన్‌గా ఈరన్న, డైరెక్టర్లుగా హత్తిబెళగల్ షేక్షావలీ, ఆలూరు ఎస్.సునందతో ప్రమాణం చేయించి, సొసైటీ సిఇఒ వెంకట రెడ్డి అధికారికంగా రికార్డు బుక్‌లో సంతకాలు చేయించారు. ఛైర్మన్ ఈరన్న మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకులు లోకేష్, టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివప్రసాద్ సహకారంతో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ బలోపేతానికి రైతులకు అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి సహకరిస్తామని హామీఇచ్చారు.


ఆలూరులో ఈరన్నను సన్మానిస్తున్న నాయకులు, సిబ్బంది

పీఠాధిపతులకు మరో విశిష్ట సత్కారం

- గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం


పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులకు మరో విశిష్ట సత్కారం లభించనుందని, గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ఆఫ్రికాకు చెందిన మైల్స్ లీడర్ షిప్ యూనివర్సిటీ వారు ఈ నెల 29న స్థానిక శ్రీమఠం ఆవరణలో డాక్టరేట్ ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు. గతంలో గుల్బర్గా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న మొదటి పీఠాధిపతులుగా చరిత్ర సృష్టించగా.. మళ్లీ మైల్స్ లీడర్‌షిప్ విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్‌ను అందుకోనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీమఠం మధ్వ కారిడార్ మార్గంలో ఉన్న శ్రీయోగేంద్ర సభ మండపంలో జరగనుందని, మైల్స్ లీడర్‌షిప్ విశ్వవిద్యాలయ అధికారులు, విశిష్ట అతిథులు హాజరుకానున్నారని తెలిపారు.

కక్ష సాధింపు తగదు

- గళమెత్తిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీల పట్ల రాజకీయ నాయకులు కక్ష సాధింపు ధోరణి అవలంభించడం తగదంటూ మండిపడ్డారు. విధుల నుంచి తొలగించిన అంగన్వాడీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. అంతకుముందు మున్సిపల్ మైదానం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాకు సిఐటియు పట్టణ కార్యదర్శి తిప్పన్న, మండల అధ్యక్షులు రామాంజనేయులు హాజరయ్యారు. అక్రమంగా తొలగించిన అంగన్వాడీ పుష్పవతి, హెల్పర్ అయ్యమ్మను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సిఐటియు నాయకులు పిఎస్.గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు, లక్ష్మన్న, వెంకటేష్, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, సరోజ మాట్లాడుతూ... పది రోజుల క్రితం వాతావరణ కాలుష్యం వల్ల నాగలాపురం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. స్పందించిన అంగన్వాడీ వర్కర్ చిన్నారులను ఆస్పత్రిలో చేర్పించారని, వారి ఆరోగ్యం కూడా కుదుట పడిందని చెప్పారు. దీనికి అంగన్వాడీ వర్కర్, హెల్పర్‌ను బాధ్యులను చేసి విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. రాజకీయ ఒత్తిడితో ఉన్నతాధికారులు వర్కర్ల, ఆయాలను తొలగించడం దుర్మార్గమని తెలిపారు. విధుల్లోకి తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

పోలీసులతో వాగ్వాదం

సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు శాంతియుతంగా నిరసన చేపడుతున్న అంగన్వాడీలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. వీడియోలు తీస్తూ భయ పెట్టే విధంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నిరసన చేపట్టాలంటే సిఐ అనుమతి తీసుకోవాలని, స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పడంతో తాము కడుపు మండి ఆందోళన చేస్తున్నామని అంగన్వాడీ నాయకులు వెంకటమ్మ, వరలక్ష్మి పేర్కొన్నారు. మహిళలను ఫొటో తీయడం, వీడియో తీయడం ఎంతవరకు సమంజసమంటూ పోలీసుల తీరుపై మండిపడ్డారు. సిడిపిఒ అధికారి కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేష్, నాగరాజు, తిక్కప్ప, మునిస్వామి ఉన్నారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన వెంకటమ్మ

కెడిసిఎంఎస్ గోడౌన్ల అద్దెలు స్వాహా..?

- అద్దె డబ్బులా... వాళ్లు మనోళ్లే..! - అటెండర్ ఇష్టారాజ్యం...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కెడిసిఎంఎస్‌కు అద్దెలు.. లీజులు.. ప్రధాన ఆదాయ వనరులు. వాటి వసూళ్లు, కేటాయింపుల్లో అధికారులు ఉదాసీనత చూపుతున్నారు. కర్నూలు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ జిల్లా మేనేజర్ అండదండలతో ఆదోని పట్టణంలో ఉన్న గోడౌన్ల అద్దె స్వాహా అయినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గోడౌన్లు నిర్మాణంలో ఉండడంతో స్థానికంగా అటెండర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. నెల, నెల బాడుగలు చెల్లింపు జరగాల్సి ఉండగా సంవత్సరాల తరబడి అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయని, అద్దెల చెల్లింపులు కూడా సంస్థలకు సక్రమంగా జరగకుండా స్వాహా చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టణంలోని పర్వతాపురం వెళ్లే రహదారిలో 3 ఎకరాల 18 సెంట్ల స్థలంలో 28 చిన్న గోడౌన్లు, 5 పెద్ద గొడన్లు ఉన్నాయి. వీటితో పాటు ఖాళీ స్థలంలో కూడా కొందరు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంలోని హవన్న పేటలో కెడిసిఎంఎస్‌కు సంబంధించిన ఒక గోడౌన్ ఖాళీ స్థలం ఉన్నట్టు సమాచారం. చిన్న గోడౌన్‌లో ఒక్కో దుకాణానికి రూ.1,800, పెద్ద గోడౌన్లకు ఒకటి రూ.10 వేలు, మరో గోడౌన్ రూ.7 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ గోడౌన్లు లీజుకు తీసుకోవాలంటే ముందుగా మూడేళ్ల అగ్రిమెంట్ చేసుకోవాలి. కొన్ని అగ్రిమెంట్లకు కాల పరిమితి పూర్తయినప్పటికీ రెన్యువల్ చేసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద గోడౌన్ విషయంలో సంవత్సరాల తరబడి అద్దెలు పెండింగ్ ఉండడంతో స్థానిక ఎమ్మెల్యేతో పంచాయితీ జరిగినట్లు సమాచారం. పంచాయితీ జరిగిన తర్వాత 'అద్దె డబ్బులా.. వాళ్లు మనోళ్లే.. చూసీచూడనట్లు పోమ్మ'ని అధికారులకు సమాధానం వచ్చిందని కొందరు తెలిపారు. నెలకు సుమారు రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఈ అద్దెలను ఒక అటెండర్ వసూలు చేస్తున్నారు. జిల్లా మేనేజర్ సహకారంతో అద్దెలను సంస్థకు సక్రమంగా చూపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అటెండర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు దుకాణదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కెడిసిఎంఎస్ గోడౌన్ల అద్దెలు సక్రమంగా సంస్థకు జమ అయ్యేటట్లు చూస్తారో లేదో వేచి చూడాలి...


కెడిసిఎంఎస్‌కు సంబంధించిన స్థలాలు

పూర్తి సమాచారం అందించలేను

- కెడిసిఎంఎస్ జిల్లా మేనేజర్, రాజేష్ కుమార్

కెడిసిఎంఎస్ గోడౌన్ల అద్దె విషయంపై జిల్లా మేనేజర్ రాజేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడగా... 'జిల్లా మొత్తం మేనేజర్ నేనే. మీరు అడిగిన సమాచారం నా వద్ద లేదు. ఆదోనికి సంబంధించిన విషయమైతే అటెండర్ అక్కడ ఉంటారు. ఆయనతో మాట్లాడమ'ని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు.

ఎవరు చెప్పారో వారితోనే కనుక్కోండి

- సూరి, అటెండర్, ఆదోని

కెడిసిఎంఎస్ గోడౌన్ల అద్దెలు విషయాలపై అటెండర్ సూరికి ప్రజాశక్తి ఫోన్ చేయగా 'ఈ విషయం నాకు తెలియదు. అద్దెలు వసూలు చేస్తానని నీకు ఎవరు చెప్పారు. వాళ్లతోనే పూర్తి సమాచారం కనుక్కోమ'ని ఫోన్ కట్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న యోగేష్

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- ఎఐసిసి అబ్జర్వర్ యోగేష్

ప్రజాశక్తి - దేవనకొండ

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎఐసిసి అబ్జర్వర్ యోగేష్, పిసిసి అబ్జర్వర్ సాకే శంకర్ కోరారు. గురువారం దేవనకొండ క్రాస్ రోడ్డులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేంద్ర నాయుడు అధ్యక్షతన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్'పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. త్వరలో జిల్లాలో కార్పొరేషన్, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో డిసిసి అధ్యక్ష పదవికి అభ్యర్థిని ఎన్నుకొని పార్టీ బలోపేతానికి సన్నాహాలు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు స్వీకరించి నియోజకవర్గ బాధ్యులను కూడా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు ఖాసీంవలీ, క్రాంతి నాయుడు, జిలాని బాషా, దామోదరం, సాంబశివుడు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సర్పంచి

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి సర్పంచి మల్లికార్జున ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. హాలహర్వి ఉమామహేశ్వర ఆశ్రమంలో సిసి రోడ్డు వేయించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆశ్రమ భక్తులు గురువారం సర్పంచిని అభినందించారు. అలాగే గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచి తెలిపారు.


సిసి రోడ్డు వేయిస్తున్న సర్పంచి మల్లికార్జున

రథోత్సవ సంబరాల్లో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి రథోత్సవ సంబరాల్లో భాగంగా ఎంపిటిసి సునంద పటేల్ యాదవ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన బెంగుళూరు జట్టుకు మొదటి బహుమతి రూ.30 వేలను కంది విజయభాస్కర్, కటికే ప్రసాద్, కటికే స్వామిరావు, గోపీని రామ్మోహన్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన అనంతపురం జట్టుకు రూ.20 వేలను బంగారు నాగరాజు, రూకుల శివ అందజేశారు. మూడో బహుమతి తిరుపతి జట్టుకు రూ.10వేలను చిలుక రమేష్ అందించారు. బెస్ట్ ప్లేయర్, బెస్ట్ డిపెండర్‌కు రూ.2 వేలను చెన్నంపల్లి చంద్రమోహన్ బ్రదర్స్ అండ్ సన్స్ అందజేశారు. సహకరించిన టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివప్రసాద్, పోలీసులకు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బజారు, డాక్టర్ షేక్షావలీ, సోమశేఖర్, మాణిక్య రెడ్డి, హనుమప్ప, ఐకాంత్, వెంకటేష్, ఆచారి, రాజశేఖర్, ప్రసాద్, దస్తగిరి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని హెచ్‌ఆర్‌బి, భూ రమణ, టిటిడి కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెళ్లి పెద్దల ఆహ్వానం మేరకు కల్యాణ మండపాలకు చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. ఆయనకు శాలువా వేసి సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, నాయకులు బాబురెడ్డి, సర్పంచి భీమయ్య, నాయకులు జనార్ధన్ రెడ్డి, బొంబాయి శివ, అండే శాంతయ్య, వడ్డే నారాయణ, చిన్న సుంకప్ప, చాకలి భీమయ్య పాల్గొన్నారు.


వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

రాఘవేంద్రుని సన్నిధిలో సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వై.సీతారామిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు రామయ్య, శివ పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో ఉన్న నాయకులు

ఆదోని వాసుల ఆగ్రహానికి గురికావద్దు

- జిల్లా ఏర్పాటుకు సహకరించాలి
- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించకపోతే ఆదోని ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ హెచ్చరించారు. ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణంలోని భీమాస్ కూడలిలో చేపట్టిన దీక్ష 11వ రోజుకు చేరింది. గురువారం దీక్షలో స్వర్ణకారులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ జైన్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. మార్కాపురం, రంపచోడవరం, మదనపల్లె జిల్లాలు కావాలని అక్కడి ప్రజలు కోరలేదని తెలిపారు. జిల్లా ఏర్పాటు చేయాలని ఆదోని వాసులు నాలుగేళ్లుగా రోడ్డెక్కినా స్పందించే వారే కరువయ్యారన్నారు. యువగళం పాదయాత్రలో ఆదోని పర్యటనకు వచ్చిన ప్రస్తుత మంత్రి లోకేష్ అధికారంలోకి వస్తే జిల్లాగా ఆదోనిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జిల్లా సాధనకు అనుకూలమని టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ప్రకటన వరకే పరిమితం కాకుండా చంద్రబాబును కలిసి అధికారికంగా ప్రకటించేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లాకు మద్దతు ఇవ్వని వారిని ప్రజలు క్షమించరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తామని చెప్పారు. నాయకులు కళ్లు తెరిచి ఆదోని జిల్లా సాధనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సాధన కమిటీ సభ్యులు న్యాయవాది లలిత, గోపాల ఆచారి, నరేంద్ర యాదవ్ ఉన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

మంత్రి భరత్ నోరు తెరవాలి

జిల్లా కావాలన్న ఆదోని ప్రజల ఆకాంక్షపై జిల్లా మంత్రి టిజి.భరత్ నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోందని జిల్లా సాధన కమిటీ సభ్యులు నూర్ అహ్మద్ తెలిపారు. జిల్లా సాధన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... 11 రోజులుగా ఆదోని వాసులు దీక్షలు చేస్తున్నా ఆదోని వాసి అని చెప్పుకునే టిజి.వెంకటేష్ తనయుడు మంత్రి టిజి.భరత్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. జిల్లా ఏర్పాటుకు కొందరు ఆటంకాలు కలిగిస్తున్నారని.. ఇక్కడ ప్రజల్లో చర్చ నడుస్తోందన్నారు. ఆదోని అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


మాట్లాడుతున్న నూర్ అహ్మద్